
# తడిసిన రెక్కలు



ములగాడ సురేష్ కుమార్

"సార్ రాంప్రసాద్‌గారి ఇల్లు ఇదేనా"

ఎదురుగా సైకిల్ ఆగిన శబ్దం, ఆ తరువాత వినిపించిన ప్రశ్న వైపుకి తలెత్తి చూసి,

"అవును, నేనే"

"మీకు కొరియర్‌లో ఉత్తరం వచ్చింది సార్"

"ఎక్కడి నుండి"

"హైదరాబాద్ నుండి సార్, ఇదిగో, ఇక్కడ సంతకం పెట్టండి" కవరు చేతికి ఇచ్చి సంతకం కోసం మరో పేపరు ఇచ్చాడు.

"ఎక్కడి నుండి బాబూ ఉత్తరం" లోపలి నుండి ప్రభావతి వచ్చి అడిగింది.

"హైదరాబాద్‌నుండట, మన సుపుత్రరత్నం అఘోరించి వుంటాడు"

"అవేం మాటలండీ, ముందు సంతకం చెయ్యండి ఆ అబ్బాయి నిలబడి ఉన్నాడు."

సంతకం చేసి ఇచ్చారు రాంప్రసాద్‌గారు.

"వస్తానమ్మా, వస్తాను సార్" కొరియర్ అబ్బాయి వెళ్ళిపోయాక,

"ఉత్తరం తీసుకుని అలా పక్కని పడేశారేంటండీ, ఏది, ఏం రాశాడో అబ్బాయి"

"పడెయ్యలేదు లేవే, పక్కన పెట్టాను. ఏం రాసి ఉంటాడా అని ఆలోచిస్తున్నాను. అసలు, ఈ అడ్రస్ వాడికి ఎట్లా గుర్తుందో నాకు అర్థం కావడం లేదు"

"మీరు మరీను, ముందా ఉత్తరం ఇటివ్వండి"

"కాకపోతే ఏవిటే, సరస్వతికి ఇప్పుడు ఏడు నిండి రేపు ఏప్రిల్‌కి ఎనిమిది వస్తాయి. దానికి రెండు నిండక ముందే, టాటా బైబై అంటూ పెళ్ళాన్ని చంకవేసుకుని చెక్కేశాడు ప్రబుద్ధుడు. ఇన్ని సంవత్సరాలకి మనం గుర్తొచ్చి ఉత్తరం రాశాడంటే, వాడి మెమొరీ పవర్ చాలా గొప్పదన్న మాటేగా"

## కథా రచయిత(త్రు)లకు మనవి

'ప్రియదత్త' సకుటుంబ సచిత్ర వార పత్రికకు కథలు పంపేవారు ఈ క్రింది విషయాలు గమనింప కోరతాము.

★ కథ అర ఠావు సైజులో 8 పేజీలు మించరాదు.

★ కథ తమ స్వీయ రచన అని, అముద్రితమని, హామీ పత్రాన్ని విధిగా జతపరచాలి.

★ కథ చివరిభాగంలో, చిరునామాను వ్రాయాలి.

★ కథలను త్రిప్పి పంపగోరువారు తగినన్ని స్టాంపులంటించిన స్వంత చిరునామా గల కవరును జతపరచాలి. – ఎడిటర్

"ఎంతైనా మీ కొడుకేగా. ముందా ఉత్తరం ఇటివ్వండి చూద్దాం ఏం రాశాడో"

"నా కొడుకే, కాదన్నానా, కాకపోతే, చరిత్రలో తండ్రి మాట జవదాటని కొడుకుల్ని గురించి చదివాం, మనకి తండ్రి మాట సరే, తండ్రినే ఛీ పోరా అని తలదన్ని వెళ్ళిపోయే కొడుకు పుట్టాడు"

"ఇప్పుడవన్నీ ఎందుకండీ"

"లేదు ప్రభా, ఒక్కసారి ఆలోచించు. నా కూతుర్ని, నా బిడ్డని, రెండేళ్ళ పిల్ల తల్లిని, కిరాతకంగా చంపేసి కిరోసిన్ స్టవ్ పేలి కాలిపోయిందన్నారు ఆ రాక్షసులు. అలాంటి వారి చేతిలో దాని పిల్లని వదిలేసి రమ్మంటావా? పెళ్ళాం చనిపోయిన సంవత్సరం లోపే మళ్ళీ పెళ్ళిచేసుకున్న ఆ దరిద్రుడు, దీన్ని సరిగ్గా పెంచుతాడా? అందుకే మనమే పెంచుదామని, సరస్వతిని తీసుకొచ్చేశాను. సరస్వతి, విమల కూతురేకదా! విమల నా కూతురే కదా! అంటే మనవాడికి అక్క కదా! సొంత అక్క కూతుర్ని పెంచుకోవలసి వస్తే కూడా, వీడు కాదు కూడదనడం ఏమైనా సమంజసంగా ఉందా? నా నిర్ణయాన్ని ఎదిరించి ఇల్లు వదిలిపోతాడా? పోనీ అని నేను కూడా వదిలేసుకున్నాను"

"అప్పటికే యాభై దాటిన వయస్సులో, రోజుకో రోగంతో ముక్కుతూ మూలుగుతూ రోజులు నెట్టుకొస్తున్న మనకి ఈ పసిపిల్ల పెంపకం ఎంత భారమో అని వాడి గోల. ఆవేశంలో ఏవేవో నిర్ణయాలు తీసుకున్నా, వాటిని నిలబెట్టుకోవడం ఎంత కష్టం. రేపు ఈ పిల్లని పెంచి, ఓ అయ్య చేతిలో పెట్టకుండా మనం పోతే, నలుగురూ ఏమంటారు? ఇవన్నీ ఆలోచించి వాడు.."

"నేను లేకపోతే వాడు ఉండడా? కొడుకంటే ఆ మాత్రం అండ ఉండదా? నేను తీసుకున్న నిర్ణయానికి వాడు కూడా కట్టుబడి ఉండాలా వద్దా? ఎవడో దారినపోయే శ్రేయోభిలాషిలాగా, తరువాత తరువాత నికేదైనా అయితే పిల్లనెవరు చూస్తారు అని ఆలోచిస్తాడా, స్కౌండ్రల్, అందుకే, వాడసలు నా కొడుకే కాదనేది నేను"

"పిల్లకి తండ్రి ఉన్నాడు కదా, చట్టప్రకారం కూడా, రేపు దాని తండ్రి వచ్చి నా పిల్లని నేను తీసుకెళతానంటే, లేదు ఇవ్వను అని మనం అనగలమా?"

"ఈ విషయమే మన వెంకట్ వాదించేవాడు, మీరు వినిపించుకోరు"

"నువ్వేంటి వాడ్ని సమర్థించుకొస్తున్నావు. అసలా పిల్లమీద ఈ తండ్రన్నవాడికి లేశమాత్రమైనా ప్రేమ ఏడ్చి ఉంటే, అసలు మనకి ఆ రోజున పిల్లని ఇచ్చేవాడా? ఈ ఆరు సంవత్సరాలలో ఒకసారైనా నా కూతురు ఎలా ఉంది, అని చూసుకోవడానికైనా వచ్చాడా? వాడు రాడు, దానికి తండ్రీ, తల్లీ అన్నీ మనమే"

"ఇప్పటివరకూ రాలేదు సరే, వస్తే పంపించెయ్యాలి కదా, పిల్లమీద హక్కు మనకంటే ఎక్కువగా తండ్రికే కదా ఉంటుంది"

"ఇరవై ఏళ్ళు అల్లారుముద్దుగా పెంచిన విమలని ఆ కిరాతకుడి చేతిలో పెట్టి చంపించేసుకున్నాం కదా, ఇదీ అంతే, హక్కు అంటూ వాడు వచ్చి దాన్ని లాక్కుపోతే, పోనీ, ఈ రెక్కలలో ఓపిక ఉన్నంత వరకు ఈ చిట్టి తల్లిని కంటికి రెప్పలా చూసుకుంటాను. దీనిలో నా విమల నాకు కనబడుతుంది. నా బిడ్డ రక్షణ నీదే నాన్నా అని నన్ను అడుగుతున్నట్లు అనిపిస్తుంది" భుజంపై కండువాతో, చెమర్చిన కళ్ళు తుడుచుకున్నాడు రాంప్రసాద్‌గారు.

"బాధపడకండీ, మీరు ఏ నిర్ణయం తీసుకున్నా అది తప్పకుండా సరైన నిర్ణయమే అవుతుంది. ఏదో ఒక్కగానొక్క కొడుకు, ఈ అంత్య దశలో మనకి తోడూ నీడగా ఉండాల్సిన వాడు, మనల్ని కాదనుకుని


గ్యాస్ ట్రబుల్
మలబద్ధకము
అజీర్ణము తో
బాధ పడుతున్నారా?
క్యాప్‌జైమ్
చూర్ణమ్ ను వాడండి
Capzyme
CHURNAM

తయారుచేయువారు :
చంద్రిక ఆయుర్వేదిక్ ఫార్మసీ
విజయవాడ-9
మార్కెట్ చేయువారు :
రామా మెడికల్ డిస్ట్రిబ్యూటర్స్ & కో.,
పార్కు రోడ్, విజయవాడ-1
ఫోన్ : 2424133

వెళ్ళిపోయాడే అని అప్పుడప్పుడూ గుండె కలుక్కుమంటూండ దంతో, ఏవేవో వాగి, మిమ్మల్ని బాధపెట్టాను" ప్రభావతి భర్త భుజంపైన చెయ్యి వేసి ఒత్తి, మరో చేత్తో కొంగు చివరతో కళ్ళు తుడుచుకుంది.

"నాకు మాత్రం వాడు కావాలని అనిపించదా ప్రభా! వాడు పక్కనుంటే, ఈ వయస్సులో నాకు ఎంత నిశ్చింత చెప్పు. ఎక్కడో, ఎప్పుడో, ఎవరికో నేను చేసిన పాపం, ఇలా వెంటాడి వేధిస్తోంది, కాలమే దీనికి మందు వేయాలి"

"అయ్యిందా, ముందు ఉత్తరం చదవండి. ఏం వుందో, చూడకుండా ఎక్కడికో వెళ్ళిపోయారు" ముందుగా తేరుకున్న ప్రభావతి అడిగింది.

"ఇదిగో నువ్వే చదువు ప్రభా" ఉత్తరం ఇచ్చారు రాంప్రసాద్‌గారు.

"కళ్ళజోడు కూడా ఇవ్వండి"

"అమ్మా నాన్నల పాదాలకి వెంకట్ నమస్కరించి రాయునది, నాన్నగారి ఆరోగ్యం బాగున్నట్లు తలుస్తాను. ఆయనకి మా పైన కోపం పోయిందా? అమ్మా! చాలాకాలం తరువాత ఉత్తరం రాస్తున్నానని నన్ను కోప్పడ వద్దు. క్షమించండి. నాకు, పావనికి, అభికి మిమ్మల్ని చూడాలని ఉంది. ఈ సంక్రాంతికి మీరు సరస్వతిని తీసుకుని హైదరాబాద్ రాగలరు. ఈ ఉత్తరం వెంట ఆరవ తేదీకి మీ ముగ్గురికీ ట్రైన్ టిక్కెట్ పంపుతున్నాను. స్టేషన్‌లో మిమ్మల్ని రిసీవ్ చేసుకుంటాము. నాన్నగారి ఆయుర్వేద వైద్యానికి సంక్రాంతి శలవలు ప్రకటించి వెంటనే రండి. సరస్వతికి దీవెనలు.

ఇట్లు

మీ వెంకట్"

"అది ఉత్తరమా, ఆఫీసు ఆర్డరా?" వాడు పెద్ద ఆఫీసరు ఉద్యోగం వెలగబెడితే మాత్రం, తండ్రికి ఆర్డరు వేస్తాడా? ఆ ఉత్తరాన్ని, దాంతోపాటు వాడు పంపిన టికెట్‌ని చించి ముక్కలు చేసి పారెయ్. అహహ, పారెయ్యొద్దు, వాడికే తిప్పి పంపెయ్యి. బుద్ధిరానీ గాడిదకి"

"అమ్మా" సరస్వతి వస్తూనే పుస్తకాల సంచి వసారా మూలకి విసిరింది.

"ఏమే పిల్లా, ట్యూషన్‌కి ఇంతసేపు పట్టిందేం ఇవాళ"

"ఈ రోజు అయ్యవారింట్లో ఏదో పూజ అమ్మా, పులిహోర పెట్టారు."

"అరే ఈ కవరు ఏంటి తాతా, ఉత్తరం వచ్చిందా?"

"మీ మామయ్య దగ్గర్నుంచే తల్లీ, నిన్ను హైదరాబాద్ రమ్మని టికెట్ కూడా పంపించాడు"

"హాయ్ భలే భలే ఎప్పుడు వెళ్తున్నాం?"

"వెళ్ళడం లేదట. ఉత్తరాన్ని, టికెట్‌ని చించి పారెయ్యమంటున్నారు మీ తాత"

"ఉ ఉ చించొద్దు, చించొద్దు, మావయ్య దగ్గరకి పోదాం.. ఎందుకు తాతా చించెయ్యమంటావు, బ్యాడ్ బాయ్, మనం హైదరాబాద్ పోదాం"

"పిల్లని అనవసరంగా ఆశ పెడ్తావెందుకు ప్రభా! లేదమ్మా, అమ్మ వట్టినే అంటున్నది."

"అంటే వెళుతున్నామా?"

"లేదమ్మా, ఉత్తరం ఏమీ రాలేదంటున్నాను"

"అబద్ధం, ఇదిగో కవరు. టు మల్లంపల్లి రాంప్రసాద్‌గారు, ఫ్రమ్ యం. వెంకట్, వెంకట అంటే మామయ్యేకదా! ఉత్తరం వచ్చింది. ఎప్పుడు పోదాం చెప్పు"

"వాడి దగ్గరకెందుకమ్మా, మనం సంక్రాంతికి ఇంకెక్కడికన్నా వెళదాం. లేకపోతే ఇక్కడే బాగుంటుంది, బసవన్నలూ, చెరుకు ముక్కలు అన్నీ చూడొచ్చు, తినొచ్చు. హైదరాబాద్ పోతే, ఏమీ ఉండవు"

"మామయ్య ఉంటాడు కదా! అన్నీ చూపిస్తాడు. అభితోటి హాయిగా ఆడుకోవచ్చు. హైదరాబాద్ పోదాం"

"అక్కడ మనకి మర్యాద ఉండదమ్మా, నీకు తెలీదు"

"ఎందుకు ఉండదు, అన్నీ ఉంటాయి. హైదరాబాద్ పోదాం తాతా, ప్లీజ్"

"ప్రభా, దీనికి తెలీడం లేదు"

"పిల్ల పేచీ పెడుతోంది కదా, నాకు కూడా వాడ్ని, కోడల్ని, అభిని చూడాలని ఉందండి. ప్రాణం తెగ పీకుతోంది. వాడుకాక మనకెవరున్నారు, కూతురు పోయింది, కొడుకుని కాదనుకుంటే ఎలా? మనంతట మనం వెళ్ళడం లేదుగా, వాడే రమ్మని రాశాడు, అయినా మనమేమీ వాడి పంచన పడుండడానికి వెళ్లడం లేదుగా, ఓసారి చూసి వచ్చేస్తాం. టికెట్ కూడా పంపాడు,. వెళదామండీ"


"మీరు వెళ్ళండి, నేను రాను"

"మీ తాత మొండి మనిషి లేమ్మా. ఆ ఉత్తరమూ టికెట్టూ ఇటివ్వవే తల్లీ, చించి అవతల పడేద్దాం. స్టేషన్‌కి ఎంతో ఆశ పడుతూ వచ్చి, మనం రాలేదంటే చూసి చూసి వాడే పోతాడు, ఎప్పుడో కాదనుకున్నాం, ఇవాళ కావాలనుకుంటే వస్తుందా" సరస్వతి చేతిలో ఉత్తరం లాక్కుంది ప్రభావతి.

"ఎందుకూ చింపడం, మిమ్మల్ని వెళ్ళమన్నాను కదా!"

"మీరు లేకుండా మేం వెళతామా, ఇదంతా జరిగేది కాదుగానీ, ఆ టికెట్ ఇలా ఇవ్వవే"

"అప్పుడే ఎందుకు చింపడం, నీ సుపుత్రుడు ఫోన్ ఏమైనా చేస్తాడేమో చూసి,



రావట్లేదని చెప్పి. అప్పుడు పారేద్దాం," ఈ రోజు ఇంకా నాలుగే కదా, ఆరుకి కదా వాడు టికెట్ పంపించింది" రాంప్రసాద్‌గారు మెత్తబడ్డారు.

"సరస్వతీ! ఈ ఉత్తరం, టికెట్టు జాగ్రత్తగా దేవుడి పటం దగ్గర కుంకుమబరిణె కింద పెట్టమ్మా"

"హాయ్ అయితే హైదరాబాద్ వెళుతున్నామన్నమాట. భలేభలే. ఉండు ఈ సంగతి లక్ష్మి, దీప్తి, రమ, సావిత్రి అందరికీ చెప్పేసి వస్తాను"

"ఉండవే టిఫిన్ చేస్తున్నాను తిని వెళుదువు గానీ"

ప్రభావతి మాట పూర్తయ్యేలోగానే, సరస్వతి తుర్రుమంది.

"నువ్వు, పిల్లా ఆశ పడ్డారని ఒప్పుకున్నానుగానీ, నా మనస్సుకి అసలు ఇష్టం లేదు ప్రభా ఈ ప్రయాణం"

"మీరు చాలా మంచివాళ్ళండీ" అనేసి లోపలికి వెళ్ళింది ప్రభావతి. పడక కుర్చీలో వెనక్కి వాలి నిట్టూర్పు విడిచారు రాంప్రసాద్ గారు.

❋ ❋ ❋

"తాతా హైదరాబాద్ వచ్చేసిందా" ట్రైన్ స్లో అవుతుంటే అడిగింది సంస్వతి.

"సికిందరాబాద్‌లో ట్రైన్ దాదాపుగా అంతా ఖాళీ అయిపోయింది. ఇక్కడే దిగాలేమో అని అనుకుంటూ ఉండగానే, తెల్లటి డ్రస్‌లో చేతిలో 'రాంప్రసాద్ ఫ్రం భద్రాద్రి' అన్న బోర్డు పట్టుకుని ఒక వ్యక్తి కిటికీ దగ్గరికి వచ్చి,

"నమస్తే సార్, నమస్తే అమ్మా, సార్ పంపించారు, రండి"


"సార్ అంటే"

"వెంకట్‌సార్ సర్, కారు పంపించారు. నేను వారి డ్రైవర్ని, పేరు మూర్తి"

"వాడు రాలేదా" రాంప్రసాద్‌గారి గొంతులో అసంతృప్తి గరుకుగా పలికింది.

"హాయ్ మామయ్య కారు పంపించాడా! తాతా పద పోదాం. ఎక్కడా కారు, నేను ముందు కూర్చుంటాను" సరస్వతి సంబరపడి పోతోంది.

"ఏమిటి ఆలోచిస్తున్నారు, కారు పంపించాడుగా, దిగండి" ప్రభావతి గొంతులోనూ కొడుకు రాలేదనే దిగులు కనబడింది.



## మీకేం తెలియదు

'గర్ల్‌ఫ్రెండ్' సినిమాలో నటిస్తున్న ఈషా కొప్పికర్‌ని 'నువ్వు లెస్బియన్‌లా నటిస్తున్నావట కదా?' అనడిగితే "అదేం కాదు. అయినా అదేమన్నా తప్పా? విరహంలో వున్నప్పుడు ఎవరికైనా స్వజాతి వారితో శృంగారంలో పాల్గొనాలనిపిస్తుంది. మీకు తెలియదేమో కానీ పెద్దలెప్పుడో ఈ విషయం చెప్పారు. అదేం పెద్ద తప్పుకాదే!" అంటూ అడిగిన ప్రశ్నకి కాకుండా మరేదో చెప్పుకొచ్చింది, అంతా తనకే తెలిసినట్లు.

❋ ❋ ❋

"స్టేషన్‌కి ఇల్లు చాలా దూరంగా ఉన్నట్టుందే" అరగంట ప్రయాణం తరువాత అన్నారు రాంప్రసాద్‌గారు.

"వచ్చేశాం సార్, ఇంకో పది నిముషాలు"

"విజయపురి కాలనీ" కారు ఓ మలుపు తిరుగుతుండగా వీధి చివర్లో ఉన్న బోర్డు చదివింది సరస్వతి. "వచ్చేశాం వచ్చేశాం మామయ్య కాలనీకి" అరిచింది చప్పట్లు కొడుతూ. స్వతంత్రంగా, విశాలంగా ఉన్న ఓ ఒంటి మేడ ఇంటి ముందు, కారు ఆపాడు మూర్తి.

"ఇదేనయ్యా ఇల్లు దిగండి, సామాన్లు నేను తెస్తాను మీరు లోపలికి వెళ్ళండి" అటు తిరిగి వచ్చి, ప్రభావతి ఉన్నవైపు డోరు తీసి పట్టుకున్నాడు. దిగి, గేటు దగ్గరకి నడిచి, నిలువెత్తు ఎత్తున్న నల్లటి బలమైన ఇనుపగేటు తీద్దామని చెయ్యి వేసిందో లేదో కెవ్వుమని అరిచి, వెనక్కి పడబోయింది. అవతల గుర్రుమంటూ సివంగిలా గేటుకి అటువైపు నుండి ఒక్క ఉదుటున గేటుపైకి లంఘించింది 'భౌ భౌ' మంటూ ఓ భీకర శునకం.

"ప్రభా" గట్టిగా కేకవేసి భార్య దగ్గరకి చేరుకుని, గజగజ వణుకుతున్న ఆమెని పొదవి పట్టుకున్నారు రాంప్రసాద్‌గారు. మూర్తి గేటు దగ్గరకి దూకి, కుక్కని పట్టుకున్నాడు. అప్పటికి ఇంటిలోనివారు అంతా అక్కడికి చేరుకున్నారు.

"అమ్మా అమ్మా" కొడుకు పిలుపుకు ఈ లోకంలోకి వచ్చింది ప్రభావతి.

"చూసుకోవద్దా, ఇడియట్, ముందు దాన్ని తీసుకెళ్ళి లోపల కట్టెయ్" మూర్తిని చివాట్లు వేసింది కోడలు.

తేరుకుని నెమ్మదిగా లోపలికి వెళ్ళారందరూ.

సోఫాలో కూర్చుని కోడలిచ్చిన మంచినీళ్ళు గొంతులో పోసుకున్న తరువాతగాని పూర్తిగా తేరుకోలేకపోయింది ప్రభావతి.

అమ్మ పక్కనే కూర్చున్నాడు వెంకట్. "రాత్రి ఆఫీసులో లేటు అయిపోయిందమ్మా, పొద్దున్నే లేవలేకపోయాను" స్టేషన్‌కి రాలేకపోయినందుకు సంజాయిషీ ఇచ్చుకున్నాడు.

చిన్నదయినా చక్కగా ఉన్న ఇల్లు, ఇంటి నిండా ఓ ఆధునిక సంసారంలో ఉండవలసిన అన్ని వస్తువులూ, కారు, డ్రైవరు, వెంకట్ మంచి స్థితిలో ఉన్నట్లు చెప్పకనే చెపుతున్నాయి.

"ఆరోగ్యం ఎలా ఉంటోంది మామయ్యగారూ" కోడలు వేసిన మొదటి కుశల ప్రశ్న.

"నాన్నగారికేం, ఆయనే అందరి రోగాలు కుదురుస్తుంటారు. చెప్పాను కదా ఆయుర్వేద వైద్యులని"

"బాగానే ఉంటోందమ్మా! ఇప్పటివరకు ఎవరినీ ఇబ్బంది పెట్టే స్థాయికి నన్ను తీసుకెళ్ళలేదు" కొడుకు దగ్గర లేడనే మాట వాళ్ళకి వినిపించాలనే అన్నారు రాంప్రసాద్ గారు. కొద్దిసేపు నిశ్శబ్దం తరువాత, కోడలు లోపలికి వెళ్ళి అందరికీ కాఫీ తీసుకొచ్చింది.

**(మిగతా వచ్చే సంచికలో)**